క్లుప్తంగా

ఎరుకులమ్మ పేరంటాలు క్యాలెండర్ ఆవిష్కరణ

కె.కోటపాడు: దాలివలస గ్రామదేవత ఎరుకులమ్మ పేరంటాలు పేరున 2023 నూతన సంవత్సరాది క్యాలెండర్‌ను రూపొందించారు. దీన్ని సోమవారం తారువలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు, యువకులు విడుదల చేశారు. ఏటా నిర్వహించే ఎరుకులమ్మ పేరంటాలు తీర్థం పోస్టర్‌ను విడుదల చేశారు.

మాజీ సర్పంచ్‌ల మృతికి సంతాపం

రావికమతం: చినపాచిల మాజీ సర్పంచ్ సాసుబిల్లి హరిహరరావు (60), గుమ్మాళ్లపాడు మాజీ సర్పంచ్ కాళింగ శివయ్యనాయుడు(40) సోమవారం ఉదయం గుండె పోటుతో హఠాన్మరణం చెందారు. హరిహరరావు 2001లో సర్పంచ్‌గా, కోఆపరేటివ్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శివయ్యనాయుడు 2013లో గుమ్మాళ్లపాడు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రజా సేవకు ఎక్కువ సమయం కేటాయించి మంచి నాయకులుగా వీరు పేరు పొందారు. రెండు గ్రామాలు పక్కపక్కనే ఉండటంతో జిల్లాలోని పలు గ్రామాల నాయకులు, అధికారులు మృతుల భౌతికకాయాలను సందర్శించి సానుభూతి తెలిపారు. ఆ రెండు గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

నేడు కె.జె.పురంలో గాంధీ తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురం గాంధీ వీధిలో గాంధీ విగ్రహం వద్ద గాంధీ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారని పేర్కొన్నారు. చిన్నారులతో దేశభక్తి గీతాలాలాపన, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అందరూ సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న వార్డు సచివాలయాల కన్వీనర్ శ్రీనివాస్

నర్సీపట్నం: సచివాలయ, వలంటీర్ల సమన్వయంతో పని చేయాలని మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీనివాస్ సూచించారు. ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలోని వార్డు సచివాలయంలో సోమవారం సచివాలయ, వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో సమర్థవంతంగా పని చేయాలన్నారు. వార్డు, కౌన్సిలర్లకు జవాబుదారీతనంగా ఉంటూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కలిసి పని చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను డోర్ టూ డోర్ తీసుకువెళ్లేందుకు గృహ సారధులను నియమించామన్నారు. వార్డు ఇన్‌చార్జులు చెరుకూరి సత్యనారాయణ, పెట్ల అప్పలనాయుడు, కణితి అన్నపూర్ణ పాల్గొన్నారు.

చేదోడు పథకం వరం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

మాకవరపాలెం: చేదోడు పథకం ఒక వరమని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి అన్నారు. చేదోడు పథకం నగదు జమ సందర్భంగా సోమవారం తామరంలో లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. అంతా ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ అయ్యన్న పాల్గొన్నారు.

నేడు గంగాదేవితల్లి ఉత్సవం

కశింకోట : మండలంలోని జి.భీమవరంలో ఉన్న గంగాదేవితల్లి ఉత్సవం మంగళవారం పెద్దఎత్తున జరగనుంది. ఉత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఏటా జరిగే ఉత్సవానికి జి.భీమవరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరవుతారని పేర్కొన్నారు. ఉత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు 'స్పర్శ'



మాకవరపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు



నాతవరం: హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్‌ఎం, వైద్య సిబ్బంది



రోలుగుంట: స్పర్శ లెప్రసీపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు విమలగిరి



కె.కోటపాడు: గుల్లేపల్లిలో కుష్టు వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న డీఎస్ఎన్.రాజు

వచ్చే నెల 13వ తేదీ వరకు సర్వే

మాకవరపాలెం: లెప్రసీ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం స్పర్శ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద లెప్రసీ నివారణకు అంతా కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గాంధీ వర్ధంతి నేపథ్యంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు అన్ని సచివాలయాల పరిధిలో స్పర్శ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దీనిలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లెప్రసీ లక్షణాలున్న వారిని గుర్తించడంతోపాటు వ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సీహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌ఈవో గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక సచివాలయం వద్ద సోమవారం స్పర్శపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి విమలగిరి ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం కుష్టు వ్యాధి నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపించడంతోపాటు పూర్తిస్థాయి నియంత్రణ చర్యలు చేపట్టిందన్నారు. ఎనిమిది గ్రామ సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాల్లోను అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు చర్యలు

నాతవరం: కుష్టు వ్యాధి నిర్మూలకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. సోమవారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రధాన కూడలిలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయం వద్ద హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గునుపూడి పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి పద్మప్రియ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు, నాతవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాళపు శివరాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి చినబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుల్లేపల్లి, ఎ.కోడూరు గ్రామాల్లో అవగాహన

కె.కోటపాడు: చర్మంపై స్పర్శలేని మచ్చలు కుష్టు వ్యాధికి సంకేతాలు అని చౌడువాడ పీహెచ్‌సీ హెచ్‌ఏ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. సోమవారం గుల్లేపల్లిలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ బండారు దేముళ్లు పాల్గొన్నారు. ఎ.కోడూరులో హెచ్‌ఏ పి.త్రినాథ్ అవగాహన కల్పించారు. కనుబొమ్మలు, కనురెప్పలు రాలిపోవుట, చెవులు, ఛాతీ మీద కణితులు, బుడిపెలు, ముఖం నూనె రంగులో మారడం లక్షణాలుగా గుర్తించాలని సూచించారు. సర్పంచ్ అక్కునాయుడు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, మాజీ వైస్ ఎంపీపీ పాటూరి ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

పారుడు వ్యాధి నివారణకు పీపీఆర్ వ్యాక్సిన్

పశుసంవర్ధక శాఖ ఏడీ బైరాగి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి

కె.కోటపాడు: గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి రాకుండా ముందస్తుగా పీపీఆర్ వ్యాక్సిన్‌ను వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కె.కోటపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రంలో సోమవారం కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల పశువైద్యాధికారులు, పశువైద్య సహాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పీపీఆర్ వ్యాక్సిన్‌ను వేసే కార్యక్రమాన్ని వచ్చే నెల 1 నుంచి 28వ తేదీ వరకూ ప్రతీ గ్రామంలో నిర్వహించాలన్నారు. కె.కోటపాడు మండలంలో 15 వేలు, దేవరాపల్లి మండలంలో 16,500 గొర్రెలు, మేకలకు ఈ టీకా వేయడాన్ని లక్ష్యం పెట్టుకున్నట్టు వివరించారు. వచ్చే వేసవిలో పశుగ్రాస సమస్య రాకుండా రాయితీపై టోటల్ మిక్సర్ రేషన్(టీఎంఆర్) దాణాను రైతులకు ఇవ్వాలన్నారు. రెండు మండలాల్లో ఇప్పటి వరకూ 200 టన్నుల టీఎంఆర్ దాణా పంపిణీ చేశామన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆవులు, గేదెల్లో ఆడపెయ్యిలు పుట్టేందుకు కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా ప్రత్యేకంగా తీసుకుంటున్న చర్యలపై రైతులకు వివరించాలని తెలిపారు. పశువైద్యాధికారులు సిహెచ్.వై.నాయుడు, మంజూషారాణి, అలేఖ్య, ప్రియాంక పాల్గొన్నారు.

రేపటి నుంచి గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు

మాడుగుల: గొర్రెలు, మేకలకు వచ్చే నెల 1 నుంచి 28వ తేదీ వరకు పి.పి.ఆర్. వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు మాడుగుల ఏరియా పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూణ్నెల్ల దాటిన గొర్రెలు, మేకలకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. ఆ సమయంలో చెవి పోగు వేయించుకోవాలని పెంపకందారులకు సూచించారు.

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో నిర్వహించిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల అమ్మవారికి క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. యూకేకి చెందిన వ్యక్తి రాజశ్యామలా హోమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి సహస్ర ఛండీ హోమాన్ని కెనడాకు చెందిన జీఆర్‌డీ అయ్యర్స్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. లోకకల్యాణమే ప్రధాన సంకల్పంగా ఐదు రోజులపాటు దీనిని నిర్వహించనున్నట్టు అన్నపూర్ణమ్మ తెలిపారు.

వైభవంగా మరిడిమాంబ తీర్థం



అమ్మవారికి పూజలు చేస్తున్న నాయకులు

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెంలో మరిడిమాంబ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి గ్రామానికి పెద్ద ఎత్తున బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడిగా మారింది. ఆలయంలో అమ్మవారికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల కోటేశ్వరరావు, సర్పంచ్ పైల పైడితల్లమ్మ తదితరులు పూజలు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వాడపాడులో...

మాడుగుల: సాగరం పంచాయతీ శివారు వాడపాడులో సీతారాములువారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు, చేశారు. ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్, ఎంపీటీసీ సభ్యులు శ్రీనాధు సూర్యకాంతం, జగ్గారావు, సర్పంచ్ కోట్ని జయమ్మ, నాయకుడు వెంకట్రావు దర్శించుకున్నారు. ఎడ్లబళ్ల పందెం, ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

జాతిపితకు ఘన నివాళి



గొలుగొండ: మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న దృశ్యం



మాడుగుల రూరల్: గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పడాల తదితర్లు



మాకవరపాలెం: తామరంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్, స్థానికులు

గొలుగొండ: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారులు, సర్పంచ్ కసిపల్లి అప్పారావు పూలమాలతో నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తి చేశారు. గ్రంథాలయ అధికారి రాజుబాబు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మండల కాంగ్రెసు పార్టీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు భీమరశెట్టి భవానీ, యూత్ కాంగ్రెసు అధ్యక్షుడు ఏసురాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ బుడబండి రాజు, పుట్టా అమరయ్యగుప్తా, నాని పాల్గొన్నారు.

మాకవరపాలెం: తామరం సచివాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, సర్పంచ్ గొంతిన చెల్లారత్నం, తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు హరిబాబు నివాళులర్పించారు. వర్తక సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి బాలదొర, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తలుపు తట్టి పథకాలు అందించడం చరిత్రాత్మకం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

గడప గడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: దేశ చరిత్రలో ప్రతీ ఇంటి తలుపు తట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. బోయిలకింతాడ గ్రామ సచివాలయ పరిధిలోని బి. కింతాడ కొత్తూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బోయిలకింతాడ గ్రామ సచివాలయ పరిధిలో మూడున్నరేళ్లలో రూ. 6.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతీ ఇంటికి కుళాయి నిమిత్తం రూ. 1.60 కోట్లు మంజూరు చేశామని, వీటిలో బి. కింతాడ కొత్తూరుకు రూ.40 లక్షలు కేటాయించామన్నారు. ఈ నిధులతో ప్రతీ ఇంటికి కుళాయితోపాటు అదనపు మంచినీటి ట్యాంక్‌లు నిర్మిస్తామన్నారు. బి. కింతాడ కొత్తూరులోని 80 ఇళ్లకు గాను రూ. 1.02 కోట్లు సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. రూ.18 లక్షలతో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి నిమిత్తం అత్యవసరంగా రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడాన్ని గమనించిన ఆయన ఉన్నతాధికారులకు నివేదించాలని ఎంఈవో సిహెచ్. రవీంద్రబాబును ఆదేశించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగాభవానీ, ఉప సర్పంచ్ కోన శ్రీను, బొబ్బిలి అప్పలనర్సమ్మ, బొబ్బిలి రాము, కోన సత్యం, బొబ్బిలి పెద అప్పారావు, బొబ్బిలి త్రిమూర్తులు, వరదపురెడ్డి లలితానాయుడు, అన్నం రామునాయుడు, సర్పంచ్‌లు గంధం రామకృష్ణ, టోకురి రామకృష్ణ, ఎంపీటీసీలు పోతుల వెంకటరావు, కోలా గోపి, అన్నం సాంబమూర్తి, అన్నం రాము, సత్యారావు, శ్రీను, సనివాడ రాజు, పి. శంకరరావు, కొప్పాక దేముళ్లు పాల్గొన్నారు.

వీఆర్వో సన్యాసిరాజుకు సత్కారం



సన్యాసిరాజును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చీడికాడ: ప్రతి ఉద్యోగి ప్రజలకు ఉత్తమ సేవలందించాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతికొండబాబు తెలిపారు. రిపబ్లిక్ డే సందర్భంగా జే.బి.పురం గ్రామ సచివాలయ వీఆర్వో సన్యాసిరాజు కలెక్టరు నుంచి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సన్యాసిరాజును జే.బిపురం, తునివలస సర్పంచ్‌లు గొల్లవిల్లి చిన్నమ్మలు, పడాల హైమాశ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సతీష్‌వర్మ సోమవారం దుశ్శాలువాలతో సత్కరించారు. తునివలస మాజీ సర్పంచ్ పడాల అప్పలనాయుడు, అచ్చిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్!

రోడ్డుపై గుంతలను పూడ్చి వేయించిన వైనం



గ్రావెల్‌తో గుంతలను కప్పిస్తున్న సీఐ ఇలియాస్ మహమ్మద్, ఎస్సై నాగకార్తీక్

రోలుగుంట: గత వర్షాలకు వడ్డాది–నర్సీపట్నం ఆర్ అండ్‌బీ రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో వాహనచోదకులు ప్రయాణాలు చేసేందుకు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు, సంబంధింత కాంట్రాక్టర్ చోద్యం చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్ ఈ సమస్యపై దృష్టి సారించారు. గుంతలు పూడ్చివేతతో కొంతమేర ప్రమాదాలు నియంత్రించొచ్చని భావించారు. వెంటనే రోలుగుంట ఎస్సై నాగకార్తీక్‌తో కలసి సోమవారం ప్రమాదాలకు కారణమైన మండల సముదాయ కూడలి నుంచి గుంతలను వాహనాలతో గ్రావెల్ తీసుకొచ్చి పూడ్చించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొత్తకోట – దొండపూడ మార్గమధ్యంలో పడిన గుంతలో ఇటీవలే ఒకరు పడి మృత్యువాతపడ్డాడని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గుంతల పూడ్చివేతతో కొంతమేర ప్రమాదాలు నియంత్రించుకునే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. వాహనాచోదకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

భూముల సర్వేకు అభ్యంతరం

రోలుగుంట: భూముల వివాదంపై హైకోర్టు ఆదేశాలు వచ్చే వరకు జె.పి.అగ్రహారంలో డ్రోన్ సర్వే చేయొద్దని గ్రామ రైతులు తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. సోమవారం తహసీల్దార్ అక్కడకు వెళ్లి సమగ్ర భూసర్వే ప్రయోజనం గురించి వివరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇక్కడ భూముల వ్యవహారం హైకోర్టులో ఉండగా, సర్వేకు ఎలా వచ్చారని అడ్డగించారు. గ్రామ రైతులు శంకరరావు, రైతు సంఘం నాయకుడు ఒసుం శ్రీను వినతపత్రం అందజేశారు. తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదిస్తానని తహసీల్దార్ తెలిపారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

స్పందనకు 32 అర్జీలు : ఆర్డీవో జయరాం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన కార్యక్రమానికి 32 అర్జీలు వచ్చాయని ఆర్డీవో హెచ్‌వీ.జయరాం తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సమాచార ఐక్యవేదిక నాయకుడు వై.మాకిరెడ్డి ఫిర్యాదు చేశారు. పాస్‌పుస్తకాలు, మ్యూటేషన్, సదరం సర్టిఫికెట్లకు ఫిర్యాదులు వచ్చాయి. ప్రతి ఫిర్యాదులో విషయాన్ని స్పష్టంగా తెలియజేయడంతోపాటు సరైన ఆధారాలను జత చేయాలని ఆర్డీవో అర్జీదారులకు సూచించారు. స్పందన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వీటి పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, ఎలక్ట్రికల్ ఏడీఈ సత్యానందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించండి



నిండుగొండలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న హెచ్‌ఎం అచ్చుతం

రోలుగుంట: కార్పొరేట్‌కు దీటుగా అన్ని మౌలిక సదుపాయాల కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రతి విద్యార్థిని చేర్పించాలని కుసర్లపూడి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పి. అచ్చుతం ఉపాధ్యాయులకు సూచించారు. కాంప్లెక్స్ పరిధిలో కొమరవోలు, కొండపాలెం, జానకీరాంపురం, నిండుగొండ గ్రామాల్లో పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నిండుగొండ యూపీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వంటకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కొండపాలెం పాఠశాలలో హాజరుపట్టీ ఆధారంగా నలుగురు విద్యార్థుల డ్రాపౌట్స్‌ను గుర్తించారు. వెంటనే వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా చేయాలని హెచ్‌ఎం కృపానందంకు సూచించారు.

ఆశాజనకంగా అపరాల సాగు

- అనుకూలించిన వాతావరణం
- అధిక దిగుబడులపై రైతుల ఆశలు



ఏపుగా పెరిగిన మినప చేను

నాతవరం: గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది అపరాల సాగు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి కరుణించడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఊహించని విధంగా వరి సాగుతోపాటు ధాన్యం దిగుబడులు బాగున్నాయి. ఆ తర్వాత వేసిన మినప, పెసర చేలు ఏపుగా పెరిగి ప్రస్తుతం కాపు దశలో కళకళలాడుతున్నాయి. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో రైతులకు అపరాల విత్తనాలు రాయితీపై పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో మండల వ్యాప్తంగా 2,310 ఎకరాల్లో మినప, 702 ఎకరాల్లో పెసర పంట వేశారు. పంట వేసిన దగ్గర్నుంచి వాతావరణం అనుకూలంగా ఉండటంతో చేను ఏపుగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా సాగును పరిశీలిస్తే నాతవరం మండలంలోనే అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తున్నారు. ఇవి అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రైతు భరోసా కేంద్రాల ద్వారా అధికారులు సూచనలు చేస్తున్నారు. ప్రధానంగా వరి చేను కోసేసిన వెంటనే మినప, పెసర విత్తనాలు చల్లడంతోపాటు భూమిలో సరిపడినంత నీటి శాతం ఉండటంతో చేను ఏపుగా పెరిగింది. పెదగొలుగొండపేట, గునుపూడి, పి.కె.గూడెం, తాండవ, నాతవరం, శంగవరం, మన్యపురట్ల, ఎస్.బి.పట్నం, రాజుపేట అగ్రహారం గ్రామాల్లో కాపు దశలో పంట ఉంది. ఈ నెలాఖరులోపు పంట చేతికందే అవకాశం ఉంది. పంట బాగుండటంతో అధిక దిగుబడులు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

నర్సీపట్నం: బహుజనుల రాజ్యాధికారం సాధించాలంటే ఏకతాటిపై నడవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి పిలుపునిచ్చారు. పట్టణంలోని బహుజన రాజ్యాధికార బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను మనువాద పార్టీలు భ్రష్టు పట్టిస్తున్నాయన్నారు. బహుజనులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలన్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో పేదల ఓట్లను కొంటున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అణచివేస్తున్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని మేనిఫెస్టోగా ప్రకటించిన ఏకైక పార్టీ బీఎస్పీ అన్నారు. అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా మనంతా పని చేయాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బొట్టా నాగరాజు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.